క్లుప్తంగా

బిల్ కలెక్టర్ల జేఏసీ జిల్లా కోశాధికారిగా సైదులు



నియామకపత్రం అందుకుంటున్న కొండా సైదులు

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ల జేఏసీ జిల్లా కోశాధికారిగా మండలంలోని రాయినిగూడెం గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ కొండా సైదులు ఎన్నికయ్యారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ల జేఏసీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కే నాయుడు.. సైదులుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పంచాయతీల బిల్ కలెక్టర్లు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మోతె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దోసపాటి రమణ శ్రీనివాస్ దంపతులు రూ.15 వేల విలువ గల మైక్ సెట్‌ను బుధవారం బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శోభాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

మునగాల : పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఆధార్‌కార్డుకు లింకు అయిన ఫోన్ నంబర్ గల సెల్‌ఫోను తీసుకొని ఆయా క్లస్టర్‌లో గల రైతు వేదికలో వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈనెల 17 నుంచి 29వ తేదీవరకు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మండల అధ్యక్షుడు చాంద్‌మియా

గరిడేపల్లి : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్‌కె చాంద్‌మియా అన్నారు. బుధవారం మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 4లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కీత సోమయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, రామమూర్తి, వెంకన్న, సైదులు, కనకయ్య, నాగయ్య, మధార్, నర్సయ్య, కోటయ్య, అంజయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం



రక్తదానం చేస్తున్న నాగుల్ మీరా

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేటు హస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళకు రక్తం అత్యవసరం కాగా బుధవారం వైద్యుల సూచనల మేరకు డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు ఆధ్వర్యంలో నాగుల్ మీరా.. మహిళకు ఓ పాజిటివ్ రక్తదానం చేశారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి



సత్యమయ్య (ఫైల్)

చిలుకూరు : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మంకెన సత్యమయ్య (85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సత్యమయ్య మృతదేహానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యమయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలని డీవైఎఫ్ఐ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను వారు సందర్శించారు. హాస్టల్‌లో సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌ను కోరారు. నాయకులు నవీన్, రాము, నరేష్, శంకర్, అనిల్ పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం !

- నిర్మించిన వారం రోజులకే పెచ్చులుగా లేస్తున్న రోడ్డు పైభాగం
- అధికారులు పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

మునగాల : గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి రోడ్ల నిర్మాణం చేపడుతుంటే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరితో నిర్మించిన రోడ్లు అనతికాలంలోనే మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల మునగాల మండలం నేలమర్రి గ్రామం నుంచి శివారు గ్రామమైన కొలిశెట్టిగూడెం వరకు నిర్మించిన బీటీ రోడ్డే ఇందుకు నిదర్శనం. 1.1 కి.మీ రోడ్డు నిర్మాణానికి కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్ఆర్) నిధుల నుంచి రూ.80 లక్షలు మంజూరయ్యాయి.



నేలమర్రి- కొలిశెట్టిగూడెం మధ్య నిర్మించిన రోడ్డు. (ఇన్‌సెట్‌లో) పెచ్చులుగా లేసిన రోడ్డు

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా నిర్మించడంతోనే కొద్ది రోజులకే పెచ్చులు ఊడి కంకర తేలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్డు



రోడ్డును పరిశీలిస్తున్న స్థానికులు

నిర్మాణం చేపట్టాడని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేలమర్రి -కొలిశెట్టిగూడెం గ్రామాల మధ్య నిర్మించిన బీటీరోడ్డును పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ లేదు



నేలమర్రి- కొలిశెట్టిగూడెం గ్రామాల మధ్య లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. దీంతో నిర్మించిన ఐదు రోజులకే పెచ్చులుగా లేస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టాడు.

– బట్టుపల్లి సుందరయ్య, నేలమర్రి

రోడ్డు పెచ్చులుగా లేస్తోంది



గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వాలు లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తుంటే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మకై నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. తాజాగా నేలమర్రి శివారులో ఇటీవల నిర్మించిన బీటీరోడ్డు పెచ్చులు లేస్తోంది.

– చిట్యాల చిన గురవయ్య, నేలమర్రి

నాణ్యతా ప్రమాణాలతోనే రోడ్డు నిర్మాణం

నేలమర్రి -కొలిశెట్టిగూడెం గ్రామాల మధ్య నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ నియమనిబంధనల మేరకే రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. కొందరు రోడ్డు నిర్మించిన వెంటనే పెకిలించి పెచ్చులుగా ఊడుతుందని ఆరోపిస్తున్నారు. నాసిరకంగా నిర్మించారనడంలో వాస్తవం లేదు. కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.

– రేవూరు హర్ష, డీఈఈ,పంచాయతీరాజ్ శాఖ

మున్సిపల్ ఉద్యోగులకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

హుజూర్‌నగర్ : వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక స్వచ్ఛత పోటీల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లో మున్సిపల్ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. అదే విధంగా పట్టణంలోని గ్రీన్ వుడ్ క్యాంపు హైస్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిశుభ్రతపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మర్రెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, మెప్మా, పురపాలక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

గరిడేపల్లి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయినిగూడెం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. చదవడం, రాయటం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు అందరికీ వచ్చేవిధంగా చూడాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

ప్రధానోపాధ్యాయులు నాగమణి, ధనలక్ష్మి, నరసింహారావు, రాజ్యలక్ష్మి, బండి పద్మ, టి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గజ సంస్థ చేయూత

మునగాల : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హైదరాబాద్‌లోని గజ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేయూతనందించింది. మండలంలోని నేలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాయణగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం గజ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీలో భాగంగా నోట్ బుక్స్, స్టేషనరీ, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గజ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గజ ఇంజనీరింగ్ ప్రైవేట్ చీఫ్ మేనేజర్లు అప్పలకొండ, జనార్దన్, సాంబమూర్తి,



నేలమర్రి జడ్పీహెచ్ఎస్‌లో బ్యాగులు పంపిణీ చేస్తున్న గజ సంస్థ ప్రతినిధులు

సీనియర్ ఇంజనీర్ కోటిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, రమేష్ గ్రామపెద్దలు సతీష్‌రెడ్డి, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జితేందర్‌రెడ్డి, టి.నరేష్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని క్యాంపు హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల డీఏ, జీపీఎఫ్ బిల్లులు సాధించడానికి ప్రభుత్వంతో పీఆర్‌టీయూ సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు. సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు హెల్త్ స్కీమ్ అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. సంఘం నాయకులు వేముల శ్రీనివాస్, అంకతి శ్రీనివాస్, ఎ.సత్య



ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

నారాయణ, బి.శ్రీను, హెచ్‌ఎం బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, బ్రహ్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, భవాని, జయమ్మ, పి.శాస్త్రి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రవి, ప్రియాంక, అనూష, నాగలత పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలి



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఏర్నేని బాబు

కోదాడ : ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోదాడ మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు అన్నారు. కోదాడలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు పొట్ల వర్షిత, షేక్ ఆషీఫాకు బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఆయన రూ.10 వేల ప్రోత్సాహకం అందజేసి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుశీలబాయి, శ్రీనివాసరావు, అప్పారావు, పుల్లయ్య, హనుమంతరావు, విద్యాసాగర్, కృష్ణారావు, ప్రసాద్, రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంగా లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని 10వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి మాట్లాడారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు నీటిని సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరిన్ పరీక్ష చేయాలన్నారు. ఆర్‌పీలు ఇంటింటి సర్వే చేసి వీధి వ్యాపారులు, పేదలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



10వ వార్డులో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

'విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే'

నడిగూడెం : గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ మండల సమన్వయకర్త అనంతుల ఆంజనేయులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి నిమ్మ తనూషా మహాలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో హాస్టల్ నిర్వాహకుల వల్లనే అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. నడిగూడెం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న తనూషా మహాలక్ష్మి మృతిపై సమగ్ర విచారణ జరపాలని, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు భోనగిరి ఉపేందర్ ఉన్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు సుంకర క్రాంతికుమార్ కోరారు. బుధవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోర్లు, బావుల కింద నార్లు పోసుకున్న రైతులు ఎడమ కాలువ నీటి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వర్షాలు లేక బావులు, బోర్ల కింద పోసిన నారుమళ్లు ఎండిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న వరి నార్లను కాపాడాలని కోరారు.

20 టిప్పర్ల ఇసుక సీజ్

హుజూర్‌నగర్: అక్రమంగా నిల్వ ఉంచిన 20 టిప్పర్ల ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద నిల్వచేసిన 10 టిప్పర్ల ఇసుకతో పాటు మండలంలోని వేపల సింగారం రోడ్డులోని సాయి రాజ్యలక్ష్మి రైస్ మిల్లు వద్ద 2 టిప్పర్ల ఇసుక, వేపల సింగారం గ్రామంలో 8 టిప్పర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ ఇసుక ఎక్కడ నుంచి తెచ్చారు, ఎవరు తెచ్చారు అనే వివరాలు సేకరించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

హుజూర్‌నగర్ : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తల సూచనల మేరకు ప్రతి గర్భిణి డెలివరీ అయ్యేంత వరకు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు సుమిత్ర, పద్మ, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ ఆకుల రజిని, ఏఎన్ఎంలు లలిత, ప్రశాంతి, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ విజయలక్ష్మి

నేరేడుచర్ల : పాడిరైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని దాచారం గ్రామంలో నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, అనిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, దండ సంజీవరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి, మార్కెట్ కార్యదర్శి సన్నీ, పశువైద్యులు జంపాల నరేష్, నీలాల శ్రీకాంత్, వెంకన్న, గోపాలమిత్రలు రామయ్య, గుండెబోయిన భాస్కర్, దేవాన్, రైతులు పాల్గొన్నారు.

కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భీమ్‌సింగ్

నడిగూడెం : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భీమ్‌సింగ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, పరిసరాలు, పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బోర్డు ఆదేశాల మేరకు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జానిపాషా, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేష్, వీరన్న, ఈశ్వర్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల బలోపేతమే లక్ష్యం

నేరేడుచర్ల : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతమే ప్రధాన లక్ష్యమని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భీమ్‌సింగ్ అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో సమస్యలను అడిగి



నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న భీమ్‌సింగ్

తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేవిధంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం 1.20 లక్షల అడ్మిషన్లు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఇంచుమించు దగ్గరలోనే ఉన్నామని, మరింత కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతామని తెలిపారు. ప్రధానంగా 10వ తరగతి చదివి బడిమానివేసిన విద్యార్థులను గుర్తించాలని, వారిని ప్రభుత్వ కళాశాలల్లో చేరే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు డాక్టర్ మద్దిమడుగు సైదులు, కేఎల్ఎన్ రావు, ప్రణతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

- కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునగాల : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టంతో కష్టపడి చదవాలని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలొస్తే కుంగిపోకుండా ధైర్యంగా, ధృఢసంకల్పంతో ఉండాలని సూచించారు. తాత్కాలిక ఆకర్షణలకు లోనై బంగారు భవిష్యత్‌ను కోల్పోవద్దని, ఆకతాయిల వేధింపులను గుర్తించి ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బాలికలకు సామాజిక అంశాలు, చదువు ప్రాముఖ్యత, సోషల్ మీడియా ప్రభావం తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే డయల్ 100, షీటీమ్స్ 8712686056 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాలికలు, మహిళల రక్షణలో పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రత్యేక అధికారి సునీతారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజ అభ్యున్నతికి దోహదం

మోతె : బాలికల చదువు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తుందని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మోతె పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం కలిగి ఉండాలన్నారు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఎలాంటి సమస్యలొచ్చినా మానసికంగా కుంగిపోకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియపరచాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడుతు



మునగాల : పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



గరిడేపల్లి : మాట్లాడుతున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

న్నారని, ఇలాంటి ధోరణి మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై యాదవేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి

గరిడేపల్లి : విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థినులు చదువుపై ఆసక్తి చూపాలన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలన్నారు. ప్రేమ వంటి ఆకర్షణలకు లోనై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. బాలికల రక్షణ చట్టాలు, షీటీమ్స్, పోలీసు శాఖ లక్ష్యాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చలికంటి నరేష్, ఎస్ఓ శైలజ, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● బోనాల సంబరం



హుజూర్‌నగర్ పట్టణంలోని వాగ్దేవి హైస్కూల్‌లో బుధవారం బోనాల సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బోనాలతో పాఠశాలకు వచ్చారు. పలువురు విద్యార్థులు పోతరాజుల వేషధారణలో విన్యాసాలు చేశారు. పలువురు అమ్మవార్ల అలంకరణలో ఆకట్టున్నారు. - హుజూర్‌నగర్

వైభవంగా తీజ్ వేడుకలు

మఠంపల్లి : మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో గిరిజనులు బుధవారం తీజ్ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు తండా పెద్ద ఇంటి నుంచి గోధుమనారు బుట్టలను ఎత్తుకుని నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా గ్రామంలోని దేవాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ గోధుమనారు బుట్టలు ఉంచి వాటి చుట్టూ ఆడిపాడి సందడి చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొండానాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, జీనునాయక్, నానుకానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర, జిల్లా నాయకులు సంజీవ్‌నాయక్, నాగేశ్వరరావునాయక్, నరేష్, బాలమ్మ,సునీతా, బుజ్జిబాబు, బాబునాయక్, హరిచంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.


గిరిజన పండుగలను ప్రభుత్వం గుర్తించాలి

మఠంపల్లి : గిరిజన పండుగలను ప్రభుత్వం గుర్తించాలని సేవాలాల్ సేన రాష్ట్ర రైతు కమిటీ అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ అన్నారు. బుధవారం మం



మఠంపల్లి : సేవాలాల్, జగదాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న సంజీవ్‌నాయక్, గిరిజనులు

డలంలోని సుల్తాన్‌పూర్‌తండా పునరావాస కాలనీలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సేవాలాల్‌మహరాజ్, జగదాంబ అమ్మవారికి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోతు నాగేశ్వరనాయక్, పూజారి తులసీనాయక్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కే.నరేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు భూక్యా బాలమ్మ, మఠంపల్లి మండల కమిటీ అధ్యక్షురాలు బుజ్జీబాయి, సునీతాబాయి, బాబు, హరిచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.



గోధుమనారు బుట్టలతో ఆలయానికి వెళ్తున్న గిరిజన మహిళలు

పశువైద్యశాలలో డాక్టర్లను నియమించాలని వినతి

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పశువైద్యులను వెంటనే నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. స్థానిక పశువైద్యశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వైద్యశాల వద్ద ధర్నా నిర్వహించి పశువైద్యాధికారి శ్యామ్ సుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో గొర్రెలు, మేకలు వందలాదిగా ఉన్నాయని, పెంపుడు జంతువులు సైతం ఎక్కువగా ఉన్నాయని వాటికి వివిధ రకాల జబ్బులు వస్తుంటే వైద్యశాలకు వెళ్తే రెగ్యులర్ డాక్టర్ లేక సరైన వైద్యం అందటం లేదని ఆయన చెప్పారు. మూగజీవాల రోగాలకు మందులు సైతం లేవని, బయట కొనుక్కోమని చెబుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట నారాయణ, మురళి, యోన, వీరమల్లు, వీరస్వామి, వెంకన్న, మల్లయ్య, సాంబయ్య, లింగయ్య, అంజయ్య, పాల్గొన్నారు.